సాక్షి సూర్యాపేట

సోమవారం । 17 । జూన్ । 2024



కమనీయం.. కల్యాణం

దర్వేశిపురం శ్రీరేణుక ఎల్లమ్మ-జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. - 8లో



నకిలీ నక్సలైట్ల ముఠా అరెస్ట్

వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పథకం పన్నిన నకిలీ నక్సల్స్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్టం / కనిష్టం 36° / 27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

• ఎస్పీ రాహుల్ హెగ్డే



సూర్యాపేట టౌన్: బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు, జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అందరూ సోదరభావంతో పండుగను జరుపుకోవాలని కోరారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింత బాబుమాదిగ

భానుపురి (సూర్యాపేట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్‌మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కేజీ టు పీజీ విద్యను విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12వేల పాఠశాలలను మూసివేసి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన విద్యావిధానం విద్యను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. ఈనెల 19న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే సంఘం రాష్ట్ర సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రావూరి విజయ్‌భాస్కర్, కార్యదర్శి బాణాల అబ్రహం, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు మహేష్, చివ్వెంల మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, నాయకులు రజనీకుమార్, మధు, సైదులు, జాను, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం బదిలీ

నల్లగొండ రూరల్: ఆర్టీసీ ఆర్‌ఎం ఆర్.శ్రీదేవి హైదరాబాద్ బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ బస్‌భవన్ ఐటీ విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న రాజశేఖర్‌ను ఆర్‌ఎంగా నల్లగొండకు బదిలీ చేశారు. నల్లగొండ ఆర్‌ఎంగా రాజశేఖర్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

'నిథమ్'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) విద్యా సంస్థలో టూరిజం కోర్సు, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నిథమ్ యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న నిథమ్‌లో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన వారికి జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయని యాజమాన్యం తెలిపింది. ఆసక్తి గల వారు 95537 00034, 95537 00035 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొంది.

క్యాట్కో ఉత్సవాలను విజయవంతం చేయాలి

నాగార్జునసాగర్ : ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించే క్యాట్కో (తెలంగాణ వినియోగదారుల సమాఖ్య)దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వేమూరి గౌరిశంకర్, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ లాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని యూత్ హాస్టల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఏటీసీఓ(క్యాట్కో)రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంపత్‌కుమార్, అన్నుబోయిన మట్టయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, ఎస్.రమేశ్‌బాబు, సిహెచ్.గురువయ్య, పి.సోమయ్య, షేక్‌సైదా, కదారి వెంకటేశ్, ముస్తఫా, నజీర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కనెక్షన్ కావలెను!

వ్యవసాయ విద్యుత్ కోసం రైతుల ఎదురుచూపులు

- గతేడాది వర్షాభావంతో ఎండిన పంటలు
- ఈ ఏడాది జోరుగా బోర్లు వేసిన రైతాంగం
- కనెక్షన్ కోసం వేలాదిగా దరఖాస్తులు
- ట్రాన్స్‌కో వద్ద 11,012 అర్జీలు పెండింగ్



భానుపురి (సూర్యాపేట): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యతలేని కారణంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వానాకాలం అలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా రైతాంగం ముందస్తు జాగ్రత్తలో భాగంగా బోర్లు వేయించడంపై దృష్టిసారించారు. జనవరి మాసం నుంచి జిల్లాలో పెద్ద ఎత్తున బోర్లు వేయిన్నారు. ఈ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ట్రాన్స్‌కోకు దరఖాస్తులు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11,012 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వానాకాలం సీజన్ ఊపందుకోవడంతో దరఖాస్తులు అందించిన రైతులు విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు	1.52 లక్షలు
గతేడాది మంజూరు చేసినవి	4,654
ఈ ఏడాది మంజూరు చేసినవి	359
జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు	11,012

వర్షాభావ పరిస్థితులతో..

2016 నుంచి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు పడ్డాయి. దీనికి తోడుగా నాగార్జున సాగర్, మూసీ, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఏటా రెండు పంటలకు సరిపడా నీటిని అందించారు. 2023 వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో స్థానికంగా, ఆయా ప్రాజెక్టుల పరిధిలోనూ నీటి నిల్వలు రెండు పంటలకు అందించే స్థాయిలో లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో సాగర్‌కు వానాకాలం, యాసంగి నీటిని విడుదల చేయకపోగా.. ఎస్సారెస్పీ కింద వానాకాలం పూర్తిస్థాయి ఆయకట్టుకు, యాసంగిలో కేవలం ఆరుతడి పంటలకే నీటిని అందించారు. ఈ సమయంలో కొందరు రైతులు అసలు సాగు పనులే చేపట్టలేదు. ఇక చాలామంది ఎలాగైనా నీళ్లు వస్తాయని భావించి పంటలను సాగు చేసి నష్టపోయారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డిమాండ్

సూర్యాపేట విద్యుత్ సర్కిల్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 1.52 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులను నమ్ముకుని పంటలను సాగు చేసే పరిస్థితి లేక పోవడంతో రైతులు బోర్లు వేయించారు. దీంతో గతేడాది నుంచి విద్యుత్ కనెక్షన్లకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే గత ఆర్థిక సంవత్సరంలో 4,674 కనెక్షన్లను సంబంధిత శాఖ అధికారులు మంజూరు చేయగా 9,654 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే మాసాల్లోనే ఏకంగా 2వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ రెండు నెలల కాలంలో జిల్లాలో 359 కనెక్షన్లకు మంజూరు ఇచ్చారు. ఇంకా జిల్లాలో 11,012 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఇప్పటికే మెట్టపంటల సాగు ముమ్మరంగా సాగుతోంది. అక్కడక్కడా రైతులు నార్లు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో నెల రోజుల్లో వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో దరఖాస్తులు అందించిన రైతులు కరెంట్ కనెక్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు వెంటనే విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయాలని జిల్లా రైతాంగం కోరుకుంటోంది.

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్య పూజా కార్యక్రమాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. స్వయంభూలను హారతితో కొలిచారు. అనంతరం ఉత్సవమూర్తులను అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య తిరుకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

నేటి ప్రజావాణి రద్దు

భానుపురి (సూర్యాపేట): బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రభుత్వ సెలవు అయినందున సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రజావాణి కార్యక్రమానికి ఎవరూ రావొద్దని పేర్కొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జానకిరాంరెడ్డి

నూతనకల్: దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరాంరెడ్డి అన్నారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలోని కేడీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామ్రాజ్యవాద కబంధహస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తులు విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు పోటీని ఇవ్వలేకపోతున్నాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను సదస్సులో ఆమోదించారు. ఈ సదస్సులో రైతు కూలీ సంఘం నాయకులు యలగందుల ముత్తయ్య, మల్లారెడ్డి, ఆవుల మల్లయ్య, రేపాక లింగయ్య, బాణాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణలో భాగంగా ఎయిర్ క్రాఫ్ట్‌తో అరవింద్ చౌహాన్





ఆకాశమే హద్దుగా..

ఎయిర్‌ఫోర్స్‌లో లెఫ్టినెంట్ పైలెట్‌గా అరవింద్ చౌహాన్


వాయువేగంతో దూసుకెళ్తున్న దేవరకొండ గిరిజన తేజం

24 ఏళ్ల వయస్సులోనే లెఫ్టినెంట్ హోదా

దేవరకొండ : శ్రమ నీ ఆయుధం అయితే.. విజయం నీ బానిస అవుతుందన్న మాటను వంట బట్టిచ్చుకున్నాడు ఆ యువకుడు. అందరిలా కాకుండా తాను తనలో ఉన్న నైపుణ్యానికి పదును పెట్టి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. చిన్నప్పుడే తన తండ్రి దూరమైనా ఏ మాత్రం తన ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా 24 ఏళ్ల వయస్సులోనే లెఫ్టినెంట్ పైలెట్ హోదా దక్కించుకొని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు దేవరకొండ మండలం ఉమ్మడి ముదిగొండ గ్రామం సీతారాంతండాకు చెందిన కొర్ర కుమార్–బుజ్జి దంపతుల మొదటి కుమారుడు అరవింద్ చౌహాన్. శనివారం హైదరాబాద్ దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ ఫ్లయింగ్ ఆఫీసర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో అరవింద్ చౌహాన్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఆఫ్ ఇండియా ఎయిర్ ఫోర్స్ వీఆర్.చౌదరి చేతుల మీదుగా ఆయన లెఫ్టినెంట్ పైలెట్ హోదా పొందారు. దీంతో గ్రామస్తులు అరవింద్‌ను అభినందిస్తున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

అరవింద్ చౌహాన్ 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు దేవరకొండలో పూర్తి చేశారు. 2013లో కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సీటు సంపాదించాడు. 2016లో యూపీఎస్సీ ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్డీయే) పరీక్షలో 175వ ర్యాంకు సాధించాడు. అనంతరం మూడేళ్లు పూణేలో శిక్షణ పొందుతూనే బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం నావల్ అకాడమీలో శిక్షణ తీసుకొని 2021మేలో ఇండియన్ నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. అనంతరం ఇటీవల ఇండియన్ ఏవియేషన్ బ్రాంచిలో నిర్వహించిన పరీక్షలో ఆయన పైలెట్‌గా ఎంపికై లెఫ్టినెంట్ హోదా పొందారు. అరవింద్‌కు 12 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే తండ్రి దూరమైనా తల్లి అన్నీ తానై చదివించింది. వారికి కుటుంబ సభ్యులైన బాబాయి విజయ్, మేనమామలు నేనావత్ రంగానాయక్, నేనావత్ జైపాల్ తోడ్పాటు అందించారు.



పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఎయిర్ మార్షల్ చీఫ్ వీఆర్ చౌదరి, తన తల్లితో అరవింద్ చౌహాన్

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

యువత పట్టుదలతో సాధించలేనిది ఏమిలేదు. చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నేడు నేను ఈ స్థాయిలో నిలబడ్డాను. ఇందుకు నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎనలేనిది. దేవరకొండ ప్రాంతానికి చెందిన యువత ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వంటి ఉద్యోగాలపై దృష్టి సారించాలి. దేశానికి ఎంతో కొంత సేవ చేయాలన్న తలంపుతో యువత ముందుకు రావాలి. - అరవింద్ చౌహాన్

అర్హులందరికీ పథకాలు అందేలా కృషి



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటరావు, బీఎస్.లత, అధికారులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ

భానుపురి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషిచేస్తానని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట జిల్లా నూతన కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 10:30 గంటలకు ఇప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.వెంకటరావు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు అన్ని శాఖల అధికారులు, జిల్లాలోని మున్సిపల్ మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఏఓ సుదర్శన్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తేజస్ నందలాల్ పవార్

నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డి

నల్లగొండ: నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వికారాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, శ్రీనివాస్, ఆర్డీఓ రవి, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత నల్లగొండ నుంచి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ హరిచందనను సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణరెడ్డి

విద్యార్థులకు వరం.. 'మెరిట్ ఉపకారం'

- 'ఎన్‌ఎంఎంఎస్' పేరుతో ఏటా ప్రతిభా పరీక్ష
- 2008 నుంచి పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఈ ఏడాది జిల్లాకు చెందిన 72 మంది విద్యార్థుల ఎంపిక
- నాలుగేళ్ల పాటు ఏటా రూ.12వేల చొప్పున అందనున్న స్కాలర్‌షిప్



రామాపురం హైస్కూల్‌లో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

హుజూర్‌నగర్: ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పథకం వరంగా మారింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 2008లో శ్రీకారం చుట్టింది. దీనిద్వారా ఏటా నిర్వహిస్తున్న పరీక్షలో ఎంతో మంది పేద విద్యార్థులు తమ ప్రతిభ చాటి ఉపకార వేతనం పొందుతూ ఉన్నత చదువులకు బాటలు వేసుకుంటున్నారు.

మూడేళ్ల నుంచి 200 మంది ఎంపిక

డిసెంబర్ 5న ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష నిర్వహించగా 1,100 మంది రాశారు. తాజాగా మెరిట్ జాబితా విడుదల కాగా ఇందులో 2023–24 సంవత్సరానికి గాను జిల్లా నుంచి 72 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే 2021–22 సంవత్సరంలో 58 మంది, 2022–23లో 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మొత్తంగా ఈ మూడేళ్లలో 200 మంది ఎంపికకావడం విశేషం.

స్కాలర్‌షిప్ ఇలా..

ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌లో పాసై స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు 2008 నుంచి 2017 వరకు నాలుగేళ్ల పాటు ఏటా రూ.6వేల చొప్పున ఇచ్చేవారు. అయితే అది విద్యార్థుల చదువులకు ఏ మాత్రం సరిపోవడంలేదనే ఉద్దేశంతో దానిని 2018వ సంవత్సరం నుంచి రూ.12 వేలకు పెంచారు. అయితే ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వారి బ్యాంక్ ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. వీరు పది పాసైన తర్వాత కూడా రెండేళ్లపాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివితేనే ఈ స్కాలర్‌షిప్ అందుతుంది.

అర్హులు వీరే..

ప్రభుత్వ పాఠశాలల్లో 7వ తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 7వ తరగతిలో 50శాతం మార్కులు, మిగతా వర్గాల వారు 55 శాతం మార్కులు పొంది ఉండాలి. ప్రభుత్వ వసతి గృహాల్లో చదవని విద్యార్థులు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష రాసేందుకు అర్హులు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రతిభగల పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌ఎంఎంఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలి. ఎక్కువ మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసే విధంగా ప్రోత్సహించాలి.

–ఎ.శ్రీనయ్య, అసిస్టెంట్ కమిషనర్, జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం, సూర్యాపేట

అంగన్‌వాడీ పిల్లలకూ యూనిఫాం

- ఈ విద్యాసంవత్సరం నుంచే అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే జిల్లాకు చేరిన వస్త్రం
- మహిళా శక్తిసంఘాలతో యూనిఫాం తయారీ
- వచ్చేనెల నుంచి పంపిణీ చేసే అవకాశం



పిల్లలకు పంపిణీ చేయనున్న యూనిఫాం డిజైన్లు

భానుపురి (సూర్యాపేట): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం వినూత్న పథకాలను తీసుకొస్తున్నాయి. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ చిన్నారులకూ ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాకు చేరిన వస్త్రం..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఇప్పటికే ఉచితంగా పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అయితే జిల్లాలోని 1,209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–6 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రస్తుతం చిన్నారుల తల్లిదండ్రులు 4ఏళ్ల నుంచే నర్సరీ అంటూ ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చే క్రమంలో మొదటగా 3–6 ఏళ్లలోపు చిన్నారులకు ఈ విద్యాసంవత్సరం నుంచి యూనిఫాం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 3–6 ఏళ్లలోపు చిన్నారులు 20,146 మంది ఉన్నట్లు అధికారులు లెక్కతేల్చి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో 20,146 మంది విద్యార్థులకు సరిపడా యూనిఫాం క్లాత్‌ను జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి చేర్చారు.

మహిళా సంఘాలకు అప్పగింత!

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలో భాగంగా మగపిల్లలకు షర్ట్, నెక్కర్, ఆడపిల్లలకు ఫ్రాగ్ అందించాలని, ఇందుకు సంబంధించిన డిజైన్‌ను ఎంపిక చేశారు. ఈ డిజైన్లలో డ్రస్‌లను కుట్టించాలని కోరుతూ స్త్రీశిశు సంక్షేమశాఖ డీఆర్‌డీఏ అధికారులకు క్లాత్‌ను అప్పగించనున్నారు. ఈ శాఖ పరిధిలో ఉన్న మహిళాశక్తి సంఘాలు ఆయా డిజైన్లలో డ్రస్‌లను కుట్టి ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్ల పిల్లలకు యూనిఫాం కుడుతున్నందున వీటిని వారికే అప్పగిస్తే మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి ఈనెలాఖరు లేదా జూలై మొదటి వారంలోనే పంపిణీ చేయాలని యోచిస్తున్నారు.

వచ్చే నెలలో పంపిణీ చేస్తాం..



ఈ విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులతో పాటుగా సంబంధించిన యూనిఫాం మెటీరియల్ అందింది. వీటిని డీఆర్‌డీఏ శాఖకు అప్పగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వచ్చే నెల వరకు యూనిఫాం కుట్టించి పిల్లలకు పంపిణీ చేస్తాం.

– వెంకటరమణ, జిల్లా సంక్షేమాధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

నల్లగొండ టూటౌన్: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఉన్నంతలో ఇతరులకు దానం చేయాలనే గొప్ప గుణాన్ని బక్రీద్ తెలియజేస్తుందన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



అదుపుతప్పి బోల్తా కొట్టిన కారు

మునగాల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. స్థానిక ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ లెక్చరర్ ఎలిగేటి మదన్‌మోహన్‌రావు- రత్నావతి దంపతులు కారులో విజయవాడకు వెళ్తుండగా మార్గమధ్యలో మునగాల వద్ద మధ్యాహ్న సమయంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో ఆ దంపతులకు ఎటువంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. అనంతరం వారిని స్థానికులు వేరే వాహనంలో కోదాడలోని వారి బంధువుల ఇంటికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పశువులను తరలిస్తున్న కంటెయినర్ పట్టివేత



పశువులను తరలిస్తూ పట్టుబడిన కంటెయినర్

కట్టంగూర్ : పశువులను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న కంటెయినర్‌ను కట్టంగూర్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో హైవేపై చెర్వుఅన్నారం బస్‌స్టాప్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటెయినర్‌ను తనిఖీ చేయగా అందులో 40 ఆవులు, 20 ఎద్దులను గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా కోతకు అమ్మేందుకు హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపాడు. పట్టుపడిన పశువులను చండూరు గోశాలకు తరలించి డ్రైవర్ వహీద్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఎన్.శ్రీను పేర్కొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య



అశోక్(ఫైల్)

మద్దిరాల : మద్యానికి బానిసై ఉరివేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మద్దిరాల మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దూరి అశోక్ మద్యానికి బానిస కావడంతో.. మద్యం తాగడం మానేస్తేనే వస్తానని చెప్పి భార్య లక్ష్మీప్రసన్న పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అశోక్ మనస్థాపానికి గురై మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు జశ్వంత్, కళ్యాణి ఉన్నారు. మృతుడి అన్న సోమేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ నాగయ్య, హెడ్ కానిస్టేబల్ మల్లయ్య తెలిపారు.

కమనీయం శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కోమటిరెడ్డి దంపతులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు



రేణుక ఎల్లమ్మ అమ్మవారు

కనగల్: భక్తులపాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ -జమదగ్ని మహర్షి 22వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ అమ్మవారు-జమదగ్ని మహాముని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కల్యాణ మండపానికి కోలాట బృందాలు, డప్పుచప్పుళ్ల మధ్య తీసుకువచ్చారు. బ్రహ్మశ్రీ డేరం భాస్కర శర్మ, ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణకుమారాచార్యులు, సుదర్శనాచార్యులు, గాదె మహేష్, దామోదర్‌రావుల అర్చకత్వంలో వేద పండితుల బృందం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కోమటిరెడ్డి దంపతులు

అమ్మవారికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి-సబిత దంపతులు ప్రభుత్వం తరపున ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్యతో కలిసి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం కోమటిరెడ్డి దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు కోమటిరెడ్డి దంపతులకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలు కప్పి పూల బొకేలు అందజేశారు. ఆలయంలో కోమటిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులందరికీ మంత్రి తన సొంత ఖర్చులతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి చేరుకుంటున్న మంత్రికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, కోలాట బృందం మహిళలు డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ బాక్సుల మధ్య ఘనంగా స్వాగతం పలకడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి.

జనసంద్రంగా ఆలయ పరిసరాలు

అమ్మవారి కల్యాణ మహోత్సవానికి నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జన సంద్రంగా మారాయి. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, లలితాసహస్ర నామర్చాన, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. డీఎస్పీ శివరాంరెడ్డి నేతృత్వంలో సీఐ వెంకట్, ఎస్‌ఐ రామకృష్ణ వాహనదారులకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తా : మంత్రి కోమటిరెడ్డి

దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలన్నారు. మనలో దైవచింతన, ఆధ్యాత్మిక భావం ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. గ్రామ దేవతలను పూజించినప్పుడే పాడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. వేడుకల్లో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, మాజీ జెడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ కమిటీ చైర్మన్ చనగాని నాగేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు భారత వెంకటేశం, దేప కర్ణాకర్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, గుండెబోయిన భిక్షం, అయితగోని స్వామిగౌడ్, గోలి నర్సిరెడ్డి, చీదేటి వెంకట్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, కూసుకుంట్ల రాజిరెడ్డి, బిల్లపాటి మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంబాబు, పెంటయ్య, శివయ్య, రమణారెడ్డి, బొడ్డుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు



కల్యాణానికి హాజరైన భక్తులు

సూర్యక్షేత్రంలో వైభవంగా పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం యజ్ఞశాలలో మహా సౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్ స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

భూదాన్‌పోచంపల్లి : రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన చింతల శ్రవణ్ (21) మృతి చెందాడు. వివరాలు.. ఇంద్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీశైలం పెద్ద కుమారుడు చింతల శ్రవణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా శనివారం కంపెనీకి సెలవు ఉండడంతో వ్యక్తిగత పనిమీద పోచంపల్లికి చెందిన పిల్లలమర్రి గణేశ్ అనే స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా పెద్దఅంబర్‌పేట సమీపంలో వీరి బైక్ డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయారు. శ్రవణ్‌కు ఛాతిభాగంలో బలమైన గాయాలు కాగా, బైక్ వెనకాల కూర్చున్న గణేశ్ ముఖానికి గాయాలై దంతాలు విరిగాయి, అలాగే కాళ్లకు దెబ్బలు తగిలి ప్రాణాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శ్రవణ్‌ను వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. శ్రవణ్ మృతదేహాన్ని మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీలు రాజనారాయణ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి బండి కృష్ణ రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి..

భువనగిరి క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని రాయగిరి గ్రామ సమీపంలో గల రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన మామిడి సాయికుమార్(22) ఘట్కేసర్‌లో గల కేపీఆర్‌ఐటీ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా రాయగిరి సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొట్టడంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్ తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన మోదుగు కృష్టారెడ్డి (67) ఆదివారం ఇంటి నుంచి మోటార్ బైక్‌పై జాన్‌పాడ్ రోడ్డులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా మోటార్ బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో కృష్టారెడ్డి తలకు, ముఖానికి గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు, బంధువులు కృష్టారెడ్డిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈవిషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వస్తున్న కారు ఓ బైక్‌ను ఢీ కొట్టడంతో భార్య మృతి చెందగా.. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్-విజయవాడ హైవేపై చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాయుడు వెంకటరమణ, అతడి భార్య అనంతలక్ష్మి (43) చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామ శివారులోని లోగిలి హోటల్‌లో పనిచేస్తున్న పెద్ద కుమారుడు రాయుడు హరీశ్‌ను చూసేందుకు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో హోటల్ సమీపంలో రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భార్య అనంత లక్ష్మి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వెంకటరమణ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొలేరో వాహనం ఢీకొని మహిళ..

వేములపల్లి : బొలేరో వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వేములపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంపులో నివాసం ఉంటున్న మల్లికంటి కలమ్మ అలియాస్ కళావతి(40) తన మనుమరాలు ఐషను ఎత్తుకుని పని నిమిత్తం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతోంది. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన తాళ్ల అంజిరెడ్డి బొలేరో వాహనంతో అతి వేగంగా వచ్చి కలమ్మను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కలమ్మ, ఐషలకు తలకు బలమైన గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న మల్లికంటి మహేష్‌కుమార్, నార్లకంటి సుధాకర్‌లు కలమ్మ భర్తకు సమాచారం అందించారు. గాయపడిన ఇరువురిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా కలమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఐషను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారం, వెండి అపహరణ



దుండగులు పగులగొట్టిన బీరువాలు

నేరేడుచర్ల : ఓ ఇంటిలో దొంగలు పడి బంగారం, వెండి ఆభరణాలు చోరీచేసిన సంఘటన నేరేడుచర్లలో చోటు చేసుకుంది. వివరాలు.. మున్సిపాలిటీ కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇంటిలోని బీరువా పగులకొట్టి రూ.9 లక్షల విలువ గల బంగారం, వెండి అపహరించారు. బాధితుడు బుర్రి అయ్యప్ప నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుర్రి అప్పయ్య మఠంపల్లి మండల కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా అతడి తమ్ముడు బుర్రి వీరన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ ఫ్రంహోం నిర్వహిస్తున్నాడు. అయ్యప్ప అత్తగారి ఊరు అయిన లింగగిరి, వీరన్న అత్తగారి ఊరు అయిన గణపవరంకు ఈ నెల 12వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలను పగులగొట్టి వస్తువులను చిందరవందరగా ఉండడాన్ని గమనించారు. టీవీని సైతం దొంగలించారు. అన్నదమ్ములకు చెందిన మూడు తులాల బంగారు చైన్లు, తులం బంగారపు మాటీలు, అరకిలో వెండి, పూజా సామగ్రి,రూ.50 వేలు అపహరించుకుపోయారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం చేరుకుని నమునాలను సేకరించింది. కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామ శివారులో గల భాగ్యనగర్ గ్రీన్‌సిటీ వెంచర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. వివరాలు వెంచర్‌లో ఒక వేప చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (45- 50)శవం కుళ్లిపోయి ఉండగా గ్రామస్తులు గమనించి సమాచారం అందించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించి గ్రామ కార్యదర్శి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రామన్నపేట: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి దుబ్బాక గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక గ్రామానికి చెందిన రైతు సోమేశ్వర్‌రావు (67) ఈ నెల 15న తన బంధువులకు చెందిన ట్రాక్టర్ ట్రాలీతో గ్రామంలోని కంబాలపల్లి శాంతి నారాయణ ఇంటి బేస్‌మెంట్‌లో మట్టిని నింపేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌లోని మట్టిని బేస్‌మెంట్‌లో పోస్తున్న క్రమంలో హైడ్రాలిక్ పైప్ నుంచి ఆయిల్ కారుతుండడం చూసి ట్రాక్టర్ దిగి పరిశీలిస్తుండగా ఇంజన్ వెనక్కు జరిగింది. ఇంజన్‌కు బేస్‌మెంట్‌కు మధ్య ఇరుక్కుపోవడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు.

పాముకాటుకు గురై మహిళ మృతి

రాజాపేట : సింగారం గ్రామానికి చెందిన కటికల తార (45) ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో ఈ నెల 14న పాముకాటుకు గురైంది. తారను చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించారు. కాగా చికిత్స పొందుతున్న తార పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



హుజూర్‌నగర్ : పట్టుబడిన నిందితులతోఎస్‌ఐ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేయడంతో ఇరువురు పారిపోగా నలుగురు పోలీసులకు చిక్కారు. ఈ సంఘటన చింతలపాలెం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నక్కగూడెం గ్రామ శివారులో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్నవారిలో మాలావత్ రవీందర్, గుగులోతు నాగరాజు పారిపోయారు. నక్కగూడెం గ్రామానికి చెందిన మలావత్ రాంబాబు, గుగులోతు చందర్‌రావు, గూగులోతు రామారావు, భూక్య సేవ్య పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ 2 వేల నగదు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మర్రిగూడ మండలంలో..

మర్రిగూడ : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు శనివారం దాడులు నిర్వహించి పలువురిని పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ కే.రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీనర్సింహస్వామి గుట్ట వెనుక ఉన్న ఒక షెడ్‌పై దాడి చేసి అక్కడ పేకాడుతున్న 10 మంది వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.3,51,150 నగదు, 9 మొబైల్స్, 2 కార్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పగిళ్ల రమేష్ రాంరెడ్డిపల్లి, మెరుగు శ్రీనివాస్ కమ్మగూడ, నోముల రవిశేఖర్ కమ్మగూడ, ఝిల్లంకి జగన్ చండూరు మండలం కొండాపురం, కోల రాములు నేరేడుచర్ల, గాదె మధు మిర్యాలగూడ, చెట్టి శ్రీనివాస్ హుజూర్‌నగర్ పాముల శివశంకర్ రాంరెడ్డిపల్లి, నాగార్జున రాంరెడ్డిపల్లి, హరీశ్ రాంరెడ్డిపల్లి పట్టుబడ్డారు. వారిని ఆదివారం దేవరకొండ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది శంకర్ రెడ్డి, రవి, సైదులు, వాహిద్ పాల్గొన్నారు.

పేకాడుతున్న 8 మందిపై కేసు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి గ్రామ శివారులోని ఒక ఇంటిలో ఆదివారం సాయంత్రం కొంతమంది వ్యక్తులు పేకాడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ అంతిరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వివరాలు.. పేకాట స్థావరంపై దాడి చేయగా శ్రీకాంత్, భిక్షం, హరీశ్, ఆనంద్, శ్రీకాంత్, గాంధీశంకర్, శోభన్‌బాబు, గంజి రఘురాములు నార్కట్‌పల్లి, నల్లగొండ, మునుగోడు గ్రామాలకు చెందిన వారు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు బైకులు, ఒక కారు, 9 మొబైళ్లు, రూ.1,45,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

నకిలీ నక్సలైట్ల ముఠా అరెస్ట్

- గుడిలో దాచిన మూడు నాటు తుపాకులు స్వాధీనం
- పలువురిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిందితుల ప్లాన్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనా దీప్తి



పట్టుబడిన నాటు తుపాకులు

నల్లగొండ క్రైం: ధనవంతులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పథకం వేసిన నకిలీ నక్సల్స్ ముఠాను గుడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదివారం తన కార్యాలయంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మే 28న గుడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి ఘనపురం గ్రామ శివారులో పెద్దమ్మ తల్లి గుడి శుభ్రం చేయడానికి తోటకూరి పెద్ద వెంకటయ్య వెళ్లి గేటు తెరిచాడు. అందులో 3 నాటు తుపాకులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ విషయమై పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తోటకూరి శేఖర్ తుపాకులను గుడిలో దాచినట్లు తెలియడంతో అతడిని పట్టుకున్నారు. తోటకూరి శేఖర్ గతంలో అక్రమంగా తుపాకులను కలిగిఉన్న విషయంలో హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చాడు. ఇతడు విప్లవ సంఘాలతో సంబంధాలు కలిగి ఉన్నాడు. శేఖర్ మిర్యాలగూడ జైలులో ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూర్ మండలం మద్దిపల్లి గ్రామానికి చెందిన గుంటుక రమేష్‌తో పరిచయం ఏర్పడింది. జైలులో నుంచి వచ్చిన తర్వాత జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశంతో రమేష్‌కు తెలిసిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మారపాక లక్ష్మీనారాయణ, మాచర్ల శ్రీనివాస్‌లు కలిసి నకిలీ నక్సలైట్లుగా మారి ధనవంతులను, మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఆపి తుపాకులతో బెదిరించి డబ్బులు దోచుకోవాలని ప్లాన్ వేశారు. ఇందుకోసం విశాఖ సమీపంలోని జీకే వీధి, పాపర్ల వద్ద నాటు తుపాకులు కొన్నారు. ఇంట్లో ఉంచుకుంటే ఎవరైనా చూస్తారని భయపడి జన సంచారం లేని ఆలయంలో తుపాకులను వారు భద్రపరిచారు. తుపాకులు పెద్దగా ఉండడంతో చిన్న పిస్తోలు లాంటిది ఉంటే సులువుగా కనపడకుండా భద్రపరచవచ్చని, బెదిరింపు సమయంలో ఎవరైనా ఎదురు తిరిగితే కాల్చేందుకు సులభంగా ఉంటుందని భావించారు. పిస్తోలు కొనుగోలు కోసం అన్వేషిస్తున్న క్రమంలో అంగడిపేట వద్ద శేఖర్ పట్టుబడ్డాడు. విచారణలో రమేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణల సమాచారం చెప్పడంతో హైదరాబాద్‌లో వీరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు సాగుతోందని ఇందులో సంబంధం ఉన్నవారిని మరోసారి విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్న గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, సీఐ ధనుంజయగౌడ్, సిబ్బంది హేమునాయక్, సత్యనారాయణ, హట్టినాయక్, కొండల్, భాస్కర్, మహేష్, గురువారెడ్డి, లాలూనాయక్‌లకు నగదు రివార్డు అందజేసి అభినందించారు.